అట్రాసిటి కేసుపై డీఎస్పీ దర్యాప్తు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఈనెల 2వ తేదీన కోటబొమ్మాళి చేపల మార్కెట్‌వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై తనకందిన ఫిర్యాదు మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ దర్యాప్తు చేసిన నేపధ్యంలో జరిగిన ఘర్షణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కోటబొమ్మాళి గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీ పార్టీలు ఎవరికివారు పెట్టుకొన్న అట్రాసిటి కేసుకు సంబంధించి గురువారం కాశీబుగ్గ డీఎస్పీ శివ రామిరెడ్డి దర్యాప్తు నిర్వహించారు. అంతకుముందు ఆయన సంఘటన స్థలాన్ని, వ్యాపార సముదాయాన్ని పరిశీలించి, చుట్టుపక్కల షాపులవారికి విచారించారు. ఈమేరకు ఈ కేసుకు సంబందించి త్వరలో నివేదికలు వెల్లడిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈయనతోపాటు టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళి, స్థానిక ఎస్ఐ షేక్ ఖాదర్‌భాషా, సిబ్బంది ఉన్నారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్‌పై అవగాహనా సదస్సు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళాడిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ పై విద్యార్థినిలకు ట్రాఫిక్ ఎస్ఐ ఎన్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో అవగహన సదస్సును నిర్వహించారు. నేడు ట్రాఫిక్ పై అవగాహన లేకపోవడం వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అలాంటి ప్రమాదాలను నిరోధించడానికి ట్రాఫిక్ పై పూర్తి అవగాహనను విద్యార్థినిలు కలిగి ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు తప్పకుండ హెల్మెట్ ను దరించాలన్నారు, అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి వాహనంకు సంబంధించిన కాగితాలు కలిగిఉండాలన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధలను తప్పకుండ పాటించి ప్రమాదాలు బారినపడకుండ ఉండాలన్నారు. కళాశాల డైరెక్టర్ బి ఎస్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థినీలందరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు, కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా పిల్లలకు వాహనాన్ని ఇచ్చేముందు ఆలోచించాలన్నారు. విద్యార్థులు కూడా వాహనాన్ని నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడుపుతున్నారని దానివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కాబట్టి ఇలాంటివి చేయకుండా ట్రాఫిక్ నియమ నిబంధలను పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓ డి. దామోదరావు, ఎపిఓ ఎమ్ శ్రీనివాసరావు విద్యార్థినిలు పాల్గొన్నారు.

బాదితునికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం పల్లిసారథి గ్రామానికి చెందిన మడియా గున్నయ్య ఇటీవల అనారోగ్యంతో ఎడమ కాలును తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శివాజీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శిరీషాలు తమవంతుగా పదివేల రూపాయలు బాధితులకు అందజేశారు. అలాగే బాధితునికి కావాల్సిన కాలు డ్రెస్సింగ్‌కు కావాల్సిన మందులు గ్లో సంస్థ ద్వారా అందిస్తామని తెలిపారు.

మందసలో : మండలం బుడారి సింగి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కుమారి మాలి కుమారుడు మురళీ మోహన్ మాలి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పలాస టీడీపీ నాయకులు గౌతు శిరీష గురువారం బాధితునికి పరామర్శించి ఆర్థిక సహాయం అందించేందుకు భరోసా ఇచ్చారు.

సంఘాల పొదుపు నుంచి అప్పులు వాడుకోవచ్చు : ఏ.పి.ఎం

విశాలాంధ్ర-ఆముదాలవలస : మహిళ స్వయం శక్తి సంఘాలలో సభ్యులు అవసరము మేరకు తమ పొదుపు ఖాతాల నుంచి కూడా అప్పులు వాడుకోవచ్చుని, వాటిపై వచ్చిన వడ్డీ మళ్లీ సంఘంలో సభ్యులందరికీ చెందుతుందని వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మా రావు తెలిపారు. ప్రతి సంఘము పంచ సూత్రాలలో భాగంగా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, పొదుపు చేసుకోవడం, అవసరం మేరకు అప్పులు వాడుకోవడం, వాయిదాల ప్రకారం తిరిగి చెల్లించుకోవడం, జవాబుదారీతనం కోసం పుస్తకాలలో సక్రమముగా నమోదు చేసుకోవడం చేయాలని సూచించారు. తోటాడ గ్రామ సంఘంలో కమ్యూనిటీ ఆడిట్ సిఆర్‌పిల సమావేశంలో పాల్గొన్నారు. అన్ని స్వయం శక్తి సంఘాలకు ఆడిట్ నిర్వహించి సంఘాలలో లావాదేవీలను ప్రతి సభ్యురాలకు అర్ధమైనట్లు తెలియపరచాలని, వారి పుస్తకాలలో లెక్కలు సక్రమంగా ఉండాలని కమ్యూనిటీ ఆడిట్ సిఆర్పిలకు సూచించారు. పొదుపు ఖాతాలలో నిల్వలు ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించి సభ్యులు ఉపయోగించుకోకుండా అనవసరంగా ఉన్న నిల్వలపై ఆరా తీశారు. పొదుపులో డబ్బులను సక్రమముగా వినియోగించుకున్న తరువాత మాత్రమే, గ్రామ సంఘాలు, శ్రీనిధి, బ్యాంకు అప్పులకు వెళ్లాలని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు, ఆడిట్ సీఆర్పీలు క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ ,వివోఏలు స్వప్న, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -శ్రీకాకుళం రూరల్: ప్రభుత్వం ఈఏడాది ధాన్యం కొనుగోలులో నూతన విధానాన్ని తీసుకురావడం జరిగిందని, అందువల్ల రైతు సోదరులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు అంబటి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని బైరి గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలు చేయడానికి వీలు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యం పంపే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. అందు వలన రైతులు త్వరగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని కోరారు. ఇందుకోసం ఒక ప్రత్యేకాధికారి నుంచి నియ మించడం జరిగింద న్నారు. తహశీల్దార్, ఏవోలతో పాటు ఆయన పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ ఎన్. వెంకటరావు మండల స్పెషల్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడి రజిని, వ్యవసాయాధికారి ఎం. ఉషకుమారి, ఏపీ సీఎస్ సీఈఓ లక్ష్మీనారాయణ,రైతు భరోసా కేంద్రం సిబ్బంది, బైరి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సమ్మేళనం

రాష్ట్రం తరపున హాజరైన ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర నేతలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: దేశ రాజధాని న్యూఢిల్లీ లోని తల్కాతురా స్టేడియంలో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సమ్మేళనం గురువారం ఘనంగా ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ఉద్యోగ సంఘాల నాయకులు ఈ సమ్మేళనంలో పాల్గొనడంతో శభాప్రాంగణం కళకళలాడింది. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మరియు అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు కామ్రేడ్ బండి శ్రీనివాసరావు, ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.వి శివారెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కన్వీనర్ రాజ్యలక్ష్మితో కలసి రాష్ట్రం తరఫున ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. తొలుత సభా వేదిక వరకు ఉద్యోగ సంఘాల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు.

మ్యుటేషన్లలోని సమస్యలు పరిష్కరించండి : సిసిఎల్ఏ సాయిప్రసాద్

విశాలాంధ్ర -శ్రీకాకుళం : రాష్ట్రవ్యాప్తంగా మ్యుటేషన్లలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి మరియు ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం మ్యుటేషన్లలోని సమస్యలు పరిష్కారంపై కలెక్టర్లు, జెసిలతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యుటేషన్లలో తలెత్తే సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. పట్టాదారు పాసుపుస్తకాలలో ఫొటో అప్ డేట్ చేయాలని సూచించారు. గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించడం ద్వారా సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. భూములను చదునుచేయడం, పట్టాలను జారీచేయడంలో శ్రీకాకుళం జిల్లా ముందంజలో ఉండటం సంతోషకరమన్నారు. ప్రతి గ్రామంలో రీసర్వేను పూర్తిచేసుకొని భూహక్కుపత్రాలను ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ యం.నవీన్, జిల్లా రెవిన్యూ అధికారి యం.రాజేశ్వరి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

విశాలాంధ్ర-మందస : అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మందస మండల టీడీపీ అధ్యక్షులు బావన దుర్యోధన అన్నారు. గురువారం జిల్లుండ గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అవినీతి పెరిగి పోయిందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, తలగాన రాజశేఖర్, సీర లోకనాథం, పల్లి మోహన రావు, కుప్పాయి కూర్మారావు, సీర బాబూజీ, ముంజేటి చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రైతుల నుంచి పాలు సేకరించి పలాసలో గల పాలశీతల కేంద్రానికి ఆటోలో తరలిస్తుండగా నగరంపల్లి సమీపంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దుద్దు సింహాచలం (19) ఆటో కింద పడి అక్కడికక్కడే మృతిచెందగా దుద్దు రేవతీపతి(13) తీవ్ర గాయాల పాలయ్యాడు. మృతుడిది పలాస మండలం తాళ్లభద్ర గ్రామం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్ర గాయాల పాలైన రేవతీపతికి వైద్య సేవలందిస్తున్నారు.

ఎన్టీఆర్ సుజల ధార నీటి సరఫరా ప్రారంభం

విశాలాంధ్ర-కంచిలి : మండలంలోని శమళ్ళ పుట్టుగ, పరిపుట్టుగ గ్రామాలకు నీరు అందించే ఎన్టీఆర్ సుజల సురక్ష మంచినీటి పథకం నీటి సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. కొద్ది కాలంగా మంచినీటి పథకం మరమ్మతులకు గురవడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. సమస్యను స్థానిక ఎంపీటీసీ మాదిన విమల, మాజీ సర్పంచ్ రామారావులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం అధికారులు మంచినీటి పథకానికి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా అధికారులకు ఎంపీటీసీ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాదిన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యోదయం కాదు.. చంద్రోదయం...

విశాలాంధ్ర -శ్రీకాకుళం రూరల్ : ఫోటో చూడగానే అబ్బ సూర్యోదయం ఎంత బాగుందో అనుకుంటున్నారా... అయితే మీరు పొరబడినట్లే... ఎందుకంటే ఇది సూర్యోదయం కాదు... చంద్రోదయం.. శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం రూరల్ మండలం, వాకలవలసలో వెలసిన శ్రీశ్రీశ్రీ దుర్గాంబికా పంచాయతన దేవాలయం పుష్కరిణిలో గురువారం మార్గశిర మాసం, పౌర్ణమి సందర్భంగా ఆవిష్కృతమైన అద్భుతమైన దృశ్యం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-కొత్తూరు : కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్- 2లో గురువారం పిఏసిఏస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు ఏఓ శ్రీనివాసరావు, సర్పంచ్ యర్లంకి ధర్మారావు, వీఆర్వో బాలక్రిష్ణ, వ్యవసాయ సహాయకులు సుగ్గు శశిధర్, షణ్ముఖ, వాలంటీర్ మురపాక రామరాజు, నరసింహ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 12 న వాహనాలకు వేలం పాట

విశాలాంధ్ర-కవిటి : వివిధ కేసుల్లో పట్టుబడిన 12 వాహనాలకు ఈనెల 12 తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాము ఒక ప్రకటన ద్వారా తెలిపారు.రెండు ఆటోలు, ఒక టాటా వ్యాన్, రెండు హెూండా యాక్టివా లు, రెండు గ్లామర్లు, యమహా రే, ప్యాషన్ ప్లస్, టీవీఎస్ స్టార్ సిటీ, యమహా ఫాస్కినో, బజాజ్ డ్యూక్ లను ఈ నెల12వ తేదీ ఉదయం 10 గంటలకు కవిటి పోలీస్ స్టేషన్ ఆవరణంలో వేలంపాట నిర్వహించబడునని ఆసక్తి కలవారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

రాజ్యాంగ ఉల్లంఘనకు జగన్ ప్రభుత్వం పాల్పడుతున్నారు

- ఇదే ధోరణి కొనసాగిస్తే కేంద్రానికి ఫిర్యాదు చేస్తా
- వైసీపీ నేతలకు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ హెచ్చరిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్: ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న వైసిపి నాయకులు తమ తీరు మార్చుకోకపోతే కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ గురువారం ఉదయం శ్రీకాకుళం హెూటల్ నాగావళిలో ఏర్పాటు చేసే విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. అసెంబ్లీలో మూడు రాజధానులకు సంబంధించి బిల్లు పెట్టకుండానే పదేపదే మూడు రాజధానులు అంటూ ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీ నాయకులు ధర్మాన ప్రసాదరావు, సీదరి అప్పల రాజు, స్పీకర్ తమ్మినేని సీతారాం పదే పదే ప్రచారం చేస్తున్నారన్నారు. ఇకపై ఇదేవిధమైన ప్రచారం కొనసాగించినట్టయితే కేంద్ర హెూంశాఖకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. రాజ్యాంగ బద్ధమైన పదవులను స్వీకరిస్తున్న సమయంలో రాజ్యాంగ నిబంధనలను అనుసరించి నడుచుకుంటామని చెప్పిన వైసీపీ పెద్దలు ఆ రాజ్యాంగ నిబంధనలోనే తుంగలోకి తొక్కుతున్నారని ఆరోపించారు. ఇక బీసీల కోసం ఎంతో చేసామని చెబుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు చేసిందేమీ లేదన్నారు. 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటుచేసినా అవి పేరుకు మాత్రమే కార్పొరేషన్లని సంబంధిత కులాల అభివృద్ధికి అవసరమైన నిధులు మాత్రం లేవని వ్యాఖ్యానించారు. ఒక ముక్కలో చెప్పాలంటే బీసీలను వైయస్ జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే బీసీలతోపాటు అన్నివర్గాల ప్రజలలో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే క్రమంలో రాజధాని గా అమరావతినే కొనసాగించాలంటూ ఈ నెల 17వ తేదీన రైతులు ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద పెద్దపెట్టున నిరసన వ్యక్తం చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. తాను కూడా నిరసనలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళుతున్నానని తెలిపారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతిని కోరుకునేవారు సాధ్యమైతే ఢిల్లీ నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఢిల్లీకి రాలేని వారు ఎక్కడికక్కడ తమ నిరసనను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

'ఏఐవైఎఫ్' ఆధ్వర్యంలో కడప ఉక్కు ఫ్యాక్టరీకై రౌండ్ టేబుల్ సమావేశం

సమావేశంలో పాల్గొన్న పలు పార్టీల ప్రతినిధులు

విశాలాంధ్ర-నరసన్నపేట : ఎన్నికల ముందు పలు సమస్యలపై హామీల వర్షం కురిపించే నాయకులు, అధికారంలోకి వచ్చి, పదవి చేపట్టిన తర్వాత వాటిని అమలుచేయటంలో ప్రజలకు చుక్కలు చూపిస్తారు. రాష్ట్ర విభజన అనంతరం నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని కేంద్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం విభజన హామీ చట్టంలో పేర్కొన్నా నేటి బిజేపి, వైసిపి ప్రభుత్వాల్లో చిత్తశుద్ది కొరవడి, కాగితాలకే ఉక్కు ఫ్యాక్టరీని పరిమితం చేశారు. కడప జిల్లాలో ఈనెల 9వ తేదీ నుండి 13వ తేదీ వరకూ సీపీఐ పార్టీ యువకులతో, విద్యార్థులతో పాదయాత్ర చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్న సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పట్టణంలో గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి, కె.శ్రీనివాసరావు నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న పలు పార్టీలకు చెందిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

ఫ్యాక్టరీ నిర్మాణంపై 'వైసిపి' ప్రశ్నించాలి - సనపల నర్సింహులు, ఇస్కాఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏళ్ళు గడుస్తున్నా ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై మీనమేషాలు లెక్కిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని, వైసిపి ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. లక్షలాది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఫ్యాక్టరీ నిర్మాణంపై వైసిపికి బాధ్యత లేదని విమర్శించారు. మోడీ సభలకు రెడ్ కార్పెట్ పరిచే వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై దృష్టి సారించాలి.

బిజెపి, వైసీపీ అభివృద్ధిపై దృష్టి సారించాలి - గొద్దు చిట్టిబాబు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ, రాష్ట్రంలో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, గొద్దు చిట్టిబాబు అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో బిజేపిని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తుందని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వ్యక్తులపై కక్షసాధింపు చర్యలు చేపడుతోందని దుయ్యబట్టారు. ప్రైవేటీ కంపెనీలకు ప్రాధాన్యతనిస్తూ అన్ని రంగాలను నిర్వీర్యం చేసే బిజేపి కడప ఉక్కు ఫ్యాక్టరీని గాలికి వదిలేసిందని విమర్శించారు.

నిరుద్యోగ సమస్యను పెంచుతున్న బిజెపి, వైసిపి - చాపర వెంకటరమణ, రైతు సంఘం నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలైన బిజేపి, వైసిపి నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్నాయని రైతు సంఘం నాయకులు, చాపర వెంకటరమణ అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఖజానా ఖాళీ అయ్యిందని, పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తే రాష్ట్రం ప్రగతి మార్గాన పయనిస్తోందని, లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టే దిశగా వైసిపి ప్రభుత్వం అడుగులు ముందుకు వేయాలి.

ఉక్కు ఫ్యాక్టరీని ఉద్యమాలతో సాధిస్తాం - మొజ్జాడ యుగంధర్, ఏఐవైఎఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రతిపక్ష రాజకీయ పార్టీల మద్దతుతో ఉద్యమాలు చేసి, సాధిస్తాం. అదానీ, అంబానీలకు పోర్టులను, విమానశ్రయాలను, రైల్వేలను తాకట్టు పెట్టి, నిరుద్యోగులపై సవతి తల్లి ప్రేమ కనబరిచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

శంకుస్థాపనలకే పరిమితమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ - కె.శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్, జిల్లా కార్యదర్శి

కడప ఉక్కు ఫ్యాక్టరీ శంఖుస్థాపనలకే పరిమితమైందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, కె.శ్రీనివాసరావు అన్నారు. 2007లో దివంగత సిఎం, డా.రాజశేఖర రెడ్డి, 2019లో చంద్రబాబునాయుడు ఆ తర్వాత సిఎం, జగన్మోహన్‌రెడ్డి శంఖుస్థాపనలు చేశారు. పునాది రాళ్ళకే పరిమితమైన పరిశ్రమను చిత్తశుద్ధితో నిర్మాణం చేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

జనవరి నాటికి 2వేల గ్రామాల్లో సర్వే పూర్తికావాలి

పిఆర్ అండ్ ఆర్.డి కమీషనర్ కోన శశిధర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జనవరి 2023 మాసాంతానికి శ్రీకాకుళం జిల్లాలో రెండు వేల గ్రామాల్లో రీసర్వే పూర్తికావాలని పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ కమీషనర్ కోన శశిధర్ కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్‌ను ఆదేశించారు. రీసర్వే పల్లెల్లో వెలుగులు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో గురువారం కమీషనర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే 350 గ్రామాల్లో పూర్తిస్థాయిలో రీసర్వే పూర్తికావడం ఆనందకరమని, ఇదేస్ఫూర్తితో వచ్చేఏడాది జనవరి మాసాంతానికి 2వేల గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన 25 లక్షల ఎల్.ఇ.డి బల్బులను రాష్ట్రంలోని ప్రతి పల్లెకు అందజేయ నున్నామని వివరించారు. వీటిని ప్రతి పల్లెలో వెలుగులు నింపేలా సెంట్రలైజ్ బాక్సులను ఏర్పాటుచేసి. రిమోట్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఆపరేటింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నిర్మాణ దశలో ఉన్నటువంటి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత దిశగా అడుగులు వేయాలని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రా లను ఏర్పాటుచేసుకొని ఆదాయం సమకూర్చుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మురుగునీటి కాల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 350 గ్రామాల్లో రీసర్వే పూర్తికావడంతో పాటు జగనన్న భూహక్కు- భూరక్ష పత్రాలను కూడా జారీ చేయడం జరిగిందన్నారు. వచ్చే జనవరి నాటికి రెండు వేల గ్రామాల్లో రీసర్వే చేసేందుకు చర్యలు చేపట్టామని హామీ ఇచ్చారు. గ్రామకంఠంకు చెందిన రికార్డులు పరిశీలిస్తున్నామని, పరిశీలన అనంతరం వాటిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులు, పోరంబోకు స్థలాలు, ఆక్రమణలో ఉన్న భూములు, రహదారులు రీసర్వేలో పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ యం.నవీన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డా. డి.వి.విద్యాసాగర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతలు పాటించాలి

విశాలాంధ్ర-ఆమదాలవలస: రహదారి భద్రతా ప్రమాణాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని అప్పుడే ప్రమాదాల సంఖ్య నివారించవచ్చని ఆముదాలవలస స్టేషన్ హౌస్ ఆఫీసర్ వై కృష్ణ తెలిపారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. రోడ్డు భద్రతుల పై అవగాహన కల్పిస్తూ, ప్రమాదాల నివారణకు యువత సహకరించాలని కోరారు. వాహనదారులకు ట్రాఫిక్ సిగ్నలింగ్పై అవగాహన కల్పించారు. నియమ నిబంధనలపై అవగాహన పెంచుకోవడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించగలమని వివరించారు. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపు రాదని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపు రాదని సూచించారు. రోడ్డు భద్రత అనుక్షణం పాటించాలని అన్నారు. ముఖ్యంగా కొంతమంది సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుంటారని అటువంటి వారు కనిపిస్తే నిలుపు చేసి రోడ్డు భద్రత పాటించాలని వారికి వివరించాలన్నారు. అటువంటి పరిస్థితుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి అని ప్రతి ఒక్కరు దీనిని గమనించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎన్ స్వామి విద్యార్థులకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏపీ ఆగ్రో జిల్లా మేనేజర్ చంద్రశేఖర రావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నామని ఏపీ ఆగ్రో జిల్లా మేనేజర్ ఎల్.చంద్రశేఖర రావు తెలిపారు. ప్రభుత్వం మండలానికి ఒక ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంజూరు చేసిందని, ఈ కేంద్రం ద్వారానే వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను విక్రయిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సైన్స్ పట్టభద్రులై ఉండి స్థానికంగా ఉన్నావారు మాత్రమే అర్హులని తెలిపారు. అర్హులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9705047864, 8297094143 నంబర్లలో సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఎం.పి.ఎఫ్.సి గొడౌన్లకు స్థల పరిశీలన వేగవంతం కావాలి

సహకార శాఖ కమీషనర్ అహ్మద్ బాబు

విశాలాంధ్ర -శ్రీకాకుళం: రాష్ట్రవ్యాప్తంగా మూడవ విడత క్రింద నిర్మించనున్న ఎం,పి,ఎఫ్.సి (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గొడౌన్లకు అవసరమైన స్థల పరిశీలన వేగవంతం చేయాలని సహకార శాఖ కమీషనర్ అహ్మద్ బాబు సంయుక్త కలెక్టర్లను కోరారు. గురువారం ఎం.పి.ఎఫ్.సి గొడౌన్లు, నిర్మాణాలు పూర్తయిన భవనాలకు బిల్లులు చెల్లింపులు తదితర అంశాలపై సంయుక్త కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 140 ఎం.పి.ఎఫ్.సి గొడౌన్లను మూడవ విడత క్రింద నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం జరిగిందని, వాటికి సంబంధించి కొన్ని జిల్లాల నుండి స్థల ప్రతిపాదనలు ఇంతవరకు అందలేదన్నారు. వీటిపై సంయుక్త కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన స్థల పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా ఫేజ్ -1 మరియు 2లో నిర్మాణాలు పూర్తయిన భవనాలకు సంబంధించిన బిల్లులను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ యం.నవీన్, జిల్లా సహకార శాఖాధికారి ఎస్.సుబ్బారావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ కలిగిన ఉప్పు ఆరోగ్యకరం

విశాలాంధ్ర-జలుమూరు: ప్రజలు తమ నిత్య తినే ఆహార పదార్థాల్లో ఉపయోగించే ఉప్పులో అయోడిన్ శాతం కనీసం 15 పిపిఎం తగ్గకుండా ఉండాలని పెద్దదూగాం సచివాలయం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె టి వి సాయి అన్నారు. గురువారం పెద్దదూగాం సచివాలయం పరిధిలో ప్రజల ఇంటి వద్ద సాధారణ ఉప్పును పరీక్షించారు. ప్రజలు వాడుతున్న సాధారణ ఉప్పులో అయోడిన్ శాతం తగ్గడం వల్ల ఎముకుల బలహీనత, థైరాయిడ్ వంటి అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు.

కొండను కొరికేస్తున్నారు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం చిన్నసాన పంచాయతీ పరిధిలో గల కొండనుంచి కొంతమంది అక్రమార్కులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కొండనుంచి అక్రమంగా కంకరను తవ్వి ట్రాక్టర్లుతో తరలిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు మిన్నకుండడం పై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో అదే త్రోవలో పలుకొండలు దర్జాగా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు దృష్టి సారించి ఇటువంటి తవ్వకాలు పై చర్యలు తీసుకోవాలని సర్వాత్రా కోరుతున్నారు.

బీజేపీ విజయంపట్ల ఎన్ఈఆర్ హర్షం

విశాలాంధ్ర-రణస్థలం : గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గం ఇంచార్జ్ నడుకుదిటి (ఎన్ఈఆర్) ఈశ్వరరావు గురువారం తమ ఆనందాన్ని నాయకులు, కార్యకర్తలతో పంచుకున్నారు. మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ఆ రాష్ట్రాల ప్రజలు నమ్మారు కాబట్టి ఘన విజయాన్ని అందించారని తెలియజేశారు. దేశానికి దిశదశ కేవలం నరేంద్ర మోడీ నాయకత్వం లోని భారతీయ జనతా పార్టీ తోనే సాధ్యమని తన అభిప్రాయం ను వ్యక్త పరిచారు. రాబోయే ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాలలో ఇదే విధమైన ఫలితాలు వస్తాయి అనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకను పురస్కరించుకొని బంటుపల్లి సర్పంచ్ రజనీ ఎన్ఈఆర్ కార్యకర్త లకు, అభిమానులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవికుమార్, బంటుపల్లి ఎంపీటీసీ టొంపల సంటీవ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు టొంపల అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ గురాల రఘునాథ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందాసు త్రినాధరావు, వెలిచేటి రామకృష్ణ, నడుకుదిటి చినబాబు, గోవిన కృష్ణారావు, చింతపల్లి రాజేష్, వెలిచేటి రమణ బాబు, గురాన రాము, గురాన రమణ, గురాన జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు తడి పంటలతోనే అధిక లాభాలు

విశాలాంధ్ర-కవిటి : ఆరుతడి పంటలు సాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు మాస్టర్ ట్రైనర్ టి.సత్యనారాయణ, వి.ఎ.ఎ.కళ్యాణ్‌లు అన్నారు. ఈమేరకు గురువారం మండలంలోని చిన్న కర్రివానిపాలెం తుపాన్ రక్షితం భవనంలో రైతులతో ప్రకృతి సాగు, ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. రైతులకు వచ్చే రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు అధికంగా సాగు చేసుకోవాలని సూచించారు. వచ్చే రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు అధికంగా సాగు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు,మాస్టర్ ట్రైనర్ టి.సత్యనారాయణ, విఎఎ కళ్యాణ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాగి విత్తనాలు పంపిణీ చేశారు.ఖరీఫ్ సీజన్ వరి కోతలు అనంతరం సాగు చేసుకొనే ఆరుతడి పంటల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎ శివనందం,

రోడ్లుపై తోపుడు బళ్లు ఉంటే చర్యలు

విశాలాంధ్ర-పలాస : రోడ్లుపై తోపుడు బళు ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ సి.ఐ జి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల తోపుడు బళ్ల చిరు వ్యాపారులకు అవగాహన కలిగించారు. తోపుడు బళ్లపై వ్యాపారులు చేస్తున్న చిరు వ్యాపారుల రోడ్లపై వ్యాపారం చేయరాదని, ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా అమ్మకాలు జరపాలని సూచించారు. ఎవరికి ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

వేగం కన్నా ప్రాణం మిన్నా

విశాలాంధ్ర-కాశీబుగ్గ : వేగం కన్నా ప్రాణం మిన్నా అని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా పాటించాలని పలాస కాశీబుగ్గ సి.ఐ శ్రీనివాసరావు అన్నారు. గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వేగం కన్నా ప్రాణం విలువైందని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని అన్నారు. వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు తమ కుటుంబ సభ్యులను మీ కోసం ఎదురు చూస్తుంటారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అలాగే సైబరు నేరగాళ్ల పట్ల జాగ్రత్తతో ఉండాలన్నారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎదురెదురుగా మోటార్ సైకిళ్ళు ఢీకొని ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-బెలగాం : ఎదురెదురుగా మోటార్ సైకిళ్ళు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన గుండాల విజయ్ కుమార్ కొమరాడ మండలం గంగురేగు వలసలో రైల్వే మూడవ లైన్ లో ఎలక్ట్రిషియన్ గా పనిచేస్తున్నాడు. తన పని ముగించుకొని రూంకు మోటార్ సైకిల్ పై వెళ్తుండగా మోటార్ సైకిల్ పై వస్తున్న సామల వినోద్ ఎదురెదురుగా ఢీ కొట్టారు. ఈ సంఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ నెల 9 నుండి 14 వరకు డిపార్ట్‌మెంట్ టెస్ట్

జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: శాఖాపరమైన పరీక్షలు నిర్వహణకు పగడ్బంది ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏపిపిఎస్సీ నిర్వహిస్తున్న ఈ నెల 9 నుండి 14 వరకు శాఖా పరమైన పరీక్షలు నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు శాఖా పరమైన పరీక్షలకు జిల్లాలో 2 పరీక్ష కేంద్రాలను ఏపిపిఎస్సీ ఏర్పాటు చేయడమైనదని, ఈ పరీక్షలకు 1189 మంది ఉద్యోగులు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్ష ఉదయం 9.00 గంటలు నుండి 11.00 గంటల వరకు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ఆబ్జెక్టివ్ టైప్ ఉంటుందన్నారు. ఇలాగే ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు ఉంటుందని, డిస్క్రిప్టివ్ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, అభ్యర్థులకు సరిపడ ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీరు ఏర్పాటు చేయాలని, ఎవరికి అప్పగించిన విధులు వారు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సిటింగ్ ఏర్పాట్లను ముందుగానే చూసుకోవాలన్నారు. సిటింగ్ ఏర్పాట్లను ముందుగానే చూడాలని చెప్పారు. ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. ఏపిపిఎస్సీ సెక్షన్ ఆఫీసర్ ఎం. భారతి, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు దృష్టి సారించాలన్నారు. ముందుగానే సిటింగ్ ఏర్పాట్లు, వెలుతురు ఉందా లేదా చూడాలని సూచించారు. సెల్ ఫోన్లు తీసుకురావద్దని చెప్పారు. సర్వీసు రూల్స్ పుస్తకాలు మాత్రమే తీసుకురావాలని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని చెప్పారు. గర్భిణులు, విభిన్న ప్రతిభా వంతులకు గ్రౌండ్ ఫ్లోర్ లోనే ఏర్పాటు చేయాలన్నారు. పలు సూచనలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఏపిపిఎస్సీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ రమేష్, ఎస్ఐ ఎస్వి రమణ, ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు, పాణిగ్రాహి, స్పెషల్ బ్రాంచ్ హెచ్.సి. కొర్లకోట నవీన్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్షన్ ఇన్చార్జ్ లు, తదితరులు పాల్గొన్నారు.

జిజిఎంపీ పనులలో జాప్యం

నాయకులు తీరుపై స్థానికుల ఆగ్రహం
పనులు చేయకుంటే బ్లాక్ లిస్టులో కాంట్రాక్టర్

విశాలాంధ్ర-ఆముదాలవలస : పట్టణంలో గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ఒక్కో సచివాలయ పరిధికి 20 లక్షల రూపాయలు నిధులు వార్డు అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేశారు. పనులను వార్డు పరిధిలో ఉన్న ఇన్చార్జిలం అంటూ మేమే చేయాలని నేతల వద్ద పట్టు పట్టడంతో ఆ పనులను వారికి అప్పగించారు. సచివాలయ పరిధిలో జరిగే పనులను తామే చేయాలని పట్టుబట్టి మంజూరైన తర్వాత ఆ పనులు చేసేందుకు వెనుకడుతున్నారు. పనులు మంజూరు సమయంలో వారు అనుకున్నా రీతిన నామినేట్ చేస్తారని భావించారు. డ్యామిడ్ కథ అడ్డం తిరిగింది అన్నట్టు ఆన్లైన్ టెండర్ ప్రక్రియ కావడంతో ఎవరికి వారు జారుకునే ప్రయత్నం చేశారు. నేతల ముందు ఒప్పందం కావడంతో టెండర్ లో నిర్దేశించిన సమయానికి ప్రైస్ కోడ్ చేసి టెండర్లు దక్కించుకున్నారు. మంజూరై 15 రోజులైంది, పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై పలుమార్లు పాలకులకు వివరించారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఈ పంచాయతీ మున్సిపల్ కార్యాలయానికి చేరింది. దీంతో అధికారులు స్పందించి పనులు పూర్తి చేయకుంటే బ్లాక్ లిస్టులో పెట్టాల్సి ఉంటుందని కాంట్రాక్టులకు శృతి మెత్తగా హెచ్చరించారు. అయినప్పటికీ

పాలకవర్గం లేకపోవడంతో ఎవరికి వారుగా కమిషనర్ను పిలిచి శంకుస్థాపనలు కూడా జరిపించారు. మొదలుపెట్టడంలోనే అసలు కథ బయటపడింది. ఇప్పటివరకు టెండర్లు చేజిక్కించుకున్నవారు అగ్రిమెంట్ పై సంతకాలు చేయకపోవడం విశేషం.16వ వార్డు 12 వార్డు పరిధిలో 20 లక్షల పనులు మంజూర య్యాయి. 12వ వార్డులో సిసి రోడ్డు లింగయ్య క్వార్టర్స్ పరిధిలో వేయుటకు కు 2 లక్షల రూపాయలు అంచనా వ్యయంగా నిర్ధారించారు. కాంట్రాక్టర్ కూన ఆంజనేయులు పేరు మీద 0. 25% తగ్గించి వేశారు. అలాగే మొదలవలస రవి ఇంటి నుంచి స్మశానం వరకు ఐదు లక్షల 30 వేలుతో సిమెంట్ రహదారి నిర్మాణానికి ఆంజనేయులు పేరుని సూచించారు. బగాది త్రినాధ పేరున మూడున్నర లక్షల అంచనా వ్యయంతో గురుగుబెల్లి సూర్య నారాయణ ఇంటి నుంచి మొదలవలస రవి ఇంటి వరకు రోడ్డు నిర్మాణానికి టెండర్లు ప్రక్రియ పూర్తి చేశారు. ముఖ్యంగా శివన్నా రాయణ క్వార్టర్స్ నుంచి పీర్రాజు క్వార్టర్స్ కు వెళ్లే సిసి డ్రైన్ తో పాటు, కల్వర్టు నిర్మాణానికి జిపిఎం ప్రకాష్ పేరున టెండర్ ఖరారు అయింది. అలాగే ఐదు లక్షల 90000 తో కూరగాయల మార్కెట్ వద్ద సిమెంట్ రోడ్డు పనులకు బగాది త్రినాధకు టెండర్ ఖరారు చేశారు. ఖరారు చేసి రెండు వారాలు సమయం దాటుతున్న నేటికీ టెండర్ ప్రక్రియలోని అగ్రిమెంట్ పూర్తి కాలేదు. ఇంకా పనులు ఎప్పుడు చేస్తారని స్థానికులు వాపోతున్నారు. తమ్మినేని సీతారాం ఇంటింటికి వచ్చినప్పుడు ఆ ప్రాంత మౌలికవస్తులైన ఆయనకులు చూపించారు. అధికారులకు సూచించి పనులు మంజూరు చేయించారు. మొదలుపెట్టడంలోనే జాప్యం జరుగుతుందని విమర్శలు ఉన్నాయి. గతంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో పనులకు టెండర్లు వేసి షెడ్యూల్ కాస్ట్ ను కూడా విడిచిపెట్టి పనులను తిరస్కరించిన విధంగానే ఇప్పుడు చేస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శివన్నారాయణ క్వార్టర్స్ లో పనులు వైసీపీ నేత వంటింటి మనిషికి దక్కాయి. ఆ పనులు చేయకుండానే బిల్లులు కాజేసే పనిలో నాయకుడు పావులు కలిపారు. అక్కడ కల్వర్టు రహదారి పరమ అధ్వానంగా ఉండడంతో యువ నాయకుడు కూడా పనులు కచ్చితంగా చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అంచనాల కంటే పాత ఎక్కువగా విధించి పనులు దక్కించుకోవడంతో ఆ పనులు చేయలేమన్న మిస్సతో తప్పించు కునేయత్నంలో కాంట్రాక్టర్ యత్నం చేస్తున్నట్లు తెలిసింది. పనులు లలో జరుగుతున్న జాప్యాన్ని స్థానికులు అధినాయకుల వద్ద ప్రస్తావించడంతో అధికారులపై భారం పడింది. దీంతో తక్షణమే పనులు చేయాలని లేకుంటే చర్యలు తప్పు అని, నోటీసులు అందించి కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని అధికా రులు హెచ్చరించారు. ఇప్పటికైనా పనులు పూర్తిచేసి స్థానికులకు రోడ్డు మార్గాన్ని కల్పించాలని సర్వత్ర కోరుతున్నారు.

సమాజం ఎటువైపు వెళుతుంది... విద్యార్థి లోకం చైతన్యం ఏమవుతుంది...?

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : 6వ తరగతి పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో ఇప్పటికి ముద్రణ కాకపోవటానికి కారణం ఏంటి...? విద్యార్థులు ప్రశ్నించటం లేదు ఎందుకని...?

ఒకప్పుడు సమయానికి టీచర్ క్లాస్‌కు రాకుంటే గోలచేసిన విద్యార్థులు ఇప్పుడెందుకు మాట్లాడరు...?

చాల కళాశాల ఉపాధ్యాల కొరతవున్నా..! విద్యార్థి యూనియన్ ఎందుకు ప్రశ్నించదు....?

ఎక్కడ చూసిన నిరుద్యోగిత...!

ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలో ఎక్కడ వుద్యోగ కల్పన లేదు..! అయనఎందుకు నిరుద్యోగులు ప్రశ్నించరు...?

భవన నిర్మాణ కార్మికులకు పనికల్పనలేదు..! ఎందుకు కార్మికులు తిరగబడరు...?

రైతు కూలికి గిట్టుబాటు వేతనం లేదు..! ఎందుకు చొక్కాపట్టుకొని నిలదీయరు..?

రైతులారా మీపంట ఇంకా పొలంలోనే వుంది, కొనేవాళ్ళులేక కక్కుర్తితో ఉన్నమీరు ఎందుకు గళం విప్పటం లేదు...?

ప్రశ్నించేవారు లేని సమాజం నిర్మాణం అంటే, ప్రశ్నించేవాళ్ళ బెదిరించటం కాదు. ప్రశ్నించవలిసిన అవసరం లేకుండా చేయటం. వాక్ స్వతంత్ర నిర్వీరము చేస్తున్న ప్రభుత్వాలు ఎక్కువకాలం సాగలేవు.

పత్రికల స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తే నిజం దాగిపోదు.

పోరాడాలని కోరికవున్న చిల్లర పథకాలకు కక్కుర్తి పడి జనం తలుపులు తెరవకుంటే..! చీకటి గాదుల్లో మగ్గవలిసింది మీజీవితాలే కాదు..! రేపటి మీ పిల్లలు భవ్యసత్.

తస్మాత్ జాగ్రత్.

విద్యావిధానం పాడైపోయింది.. ఒక గ్రాడ్యుయేట్ కి విలువలేదు. ఈరోజు ఎందుకు చదువుతున్నామో చెప్పలేని పరిస్థితులలో విద్యార్థి వున్నాడు. దానికి కారణం ఎవరు...?

ప్రశ్నించలేని ని చేతకానితనం. డబ్బులు పంచుకుంటూ ఎన్నాళ్ళు దేశాన్ని నడిపిస్తారు...?

నీవు ఎన్నాళ్ళు ఇంకా డబ్బుకోసం కక్కుర్తి పడతావు..?

ఆర్థికమాంద్యం ప్రబలుతోంది... రేపు ఇలా దేశం మొత్తం డబ్బు పంచుకుంటూ పోవుతుంటే...! ద్రవ్యల్బణం ఏర్పడుతుంది.

నీవు డబ్బు ముద్రించగలవేమో కానీ..! నిత్యావసర సరుకులు అప్పటికప్పుడు పండించలేవని గుర్తు పెట్టుకోండి.

ఇప్పటికైన విద్యార్థులు, నిరోద్యుగుల తల్లితండ్రులు పై విషయాలపై ఆలోచించండి.

లింగ వివక్షత సమాజానికి చేటు

విశాలాంధ్ర-ఆముదాలవలస: లింగ వివక్షత వీడితేనే సమాజాభివృద్ధి సాధ్యమని మెప్మా జిల్లా సంస్థాగత బలోపేత సాంకేతిక నిపుణులు బి.రామారావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్లం సమాఖ్యల ఆర్పీల సమీక్షలో పాల్గొన్నారు. ఆధునిక సమాజంలో లింగ వివక్షత పోకడలు పెరిగిపోవడం సభ్య సమాజానికి చేటన్నారు. ఈదిశగా మెప్మా ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించే విధంగా నవంబర్ 25 నుండి డిసెంబర్ 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. లింగ వివక్షత పేరుతో వ్యక్తులపై సామాజిక, ఆర్థిక, లైంగిక వేదింపులు సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సెటీ ఆర్థిక కౌన్సిలర్ డాక్టర్ బి.బలరాం మట్లాడుతూ ఈరోజుల్లో ఎక్కువగా సాంకేతిక ఆర్థిక మోసాలు జరుగుతుండటం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు అడిగే ఆర్థిక లావాదేవీల వివరాలకు స్పందించరాదని తెలిపారు. ఏటీఎం సెంటర్లలో, ఆన్లైన్ లావాదేవీ లు నిర్వహించే విషయంలో పూర్తి అవగాహనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా సాంఘిక భద్రతా సమన్వయకర్త పి.విజయ కుమారి, స్థానిక సిబ్బంది కె.రాజేష్ కుమార్, జె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతా.. అవకాశాన్ని వదులుకోవద్దు... హక్కులు కోల్పోవద్దు

- జీవితకాలభూ సమస్యలకు రీ-సర్వేతోనే శాశ్వత పరిష్కారం
- అపోహలు వీడి ప్రక్రియలో ప్రతి రైతూ భాగస్వామ్యం కావాల్సిందే
- మొదటి దశ పూర్తి చేసుకొని రెండో దశకు సిద్ధమవుతున్నవేళ అధికారుల పిలుపు
- తొలి దశలో 24 మండలాలకు చెందిన 11 వేల మంది రైతులకు వెబ్‌ల్యాండ్‌లో చోటు

విశాలాంధ్ర-విజయనగరం : గతంలో భూ యజమానులకు తెలియకుండానే వారి భూ రికార్డుల్లో వేరే వారి పేర్లు ఎక్కడం, రికార్డులు తారుమారు కావటం చూశాం. తరతరాలుగా అనుభవిస్తున్నప్పటికీ హఠాత్తుగా నిషేధిత జాబితాలో చేర్చిన ఘటనలు చూశాం. దీనివల్ల అనేక లక్షల మంది నిరంతరంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 3,648 కి.మీ. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇలాంటి ఘటనలు ఎన్నో నా దృష్టికి వచ్చాయి. దీనికి పరిష్కార మార్గంగా దేశంలో మరెక్కడా లేని విధంగా సుమారు 100 సంవత్సరాల తరువాత మీ అందరి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేయిస్తోంది... ఇవన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నదాతలకు అందజేసే భూహక్కు పత్రంలో పేర్కొన్న అంశాలు.

వందేళ్ల సమస్యలకు ఒక్క సర్వేతో పరిష్కారం చూపాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే ప్రక్రియ జిల్లాలో విజయవంతంగా సాగుతోంది. మొదటి దశలో భాగంగా ఇప్పటి వరకు 24 మండలాల్లోని 179 గ్రామాల్లో సమగ్ర భూ సర్వే సజావుగా జరిగింది. సుమారు 11వేల మందికి వెబ్‌ల్యాండ్‌లో చోటు కల్పిస్తూ.. సర్వ హక్కులూ అందిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి క్షేత్ర స్థాయిలో భూములను సర్వే చేయటంలో అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు. అయితే రీ-సర్వే ప్రక్రియలో రైతుల నుంచి గ్రామస్థుల నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందటం లేదన్నది అధికారులు, సిబ్బంది చెబుతున్న మాట. అపోహలు వీడి రైతులు పూర్తి స్థాయిలో సహకరిస్తే సమగ్ర భూ సర్వేను మరింత విజయవంతంగా నిర్వహిస్తామని పేర్కొంటున్నారు.

రీ-సర్వే అవసరమా.. అవసరమైతే ఎందుకు

ఇటీవల క్షేత్రస్థాయి సిబ్బందికి జరిగిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లేవనెత్తిన మొదటి ప్రశ్న ఇది. అసలు రీ-సర్వే అవసరం ఉందా, ఉంటే ఎందుకు? అనే ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. ఒకప్పటికీ ఇప్పటికీ పరిస్థితులు మారాయి. ఎన్నో ఏళ్ల నుంచి పాత రికార్డుల ఆధారంగానే రిజిస్ట్రేషన్లు, ఇతర ప్రక్రియలు సాగుతున్నాయి. దీనివల్ల తప్పులు దొర్లుతున్నాయి. కావున రీ-సర్వే అవసరమే అని మూకుమ్మడిగా రెవెన్యూ, సర్వే సిబ్బంది పేర్కొన్నారు. ఈ క్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. సాదా బై నామా ద్వారా జరిపిన లావాదేవీలకు శాశ్వత హక్కులు లభిస్తాయని, ప్రభుత్వ, దేవాదాయ భూములకు రక్షణ కలుగుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న జీవితకాల సమస్యలకు ఒక్క రోజు సర్వేతో పరిష్కారం లభిస్తుందని ఉద్ఘాటించారు.

రీ-సర్వే జరిగితే రైతుకు కలిగే ప్రయోజనాలు ఏంటి

రీ-సర్వే ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయి. ఒకప్పటిలా కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పనిలేదు. చలానాలు కట్టాల్సిన అవసరం లేదు. డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండదు. ఒక్క మాటలో చెప్పాలంటే పైసా ఖర్చు లేకుండా తన ఆస్తికి సర్వ హక్కులూ లభిస్తాయి. సాగుచేసుకుంటున్న పొలాలతో పాటు 4 లక్షల ఖాతాలకు సంబంధించిన గ్రామ కంఠాలకు, సాదా బై నామా ద్వారా జరిగిన లావాదేవీలకు కూడా సంపూర్ణ హక్కులు లభిస్తాయి. వారసత్వంగా వచ్చిన భూములకు కుటుంబ సభ్యుల సమక్షంలోనే చిటికెలో పరిష్కారం లభిస్తుంది. అంతేకాదు సరిహద్దు గొడవలు.. పంపకాల చిక్కులు తొలగిపోతాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే సర్వే వల్ల భూములకు సంబంధించి ప్రత్యేక ఎల్.పి.ఎం. నంబర్ ద్వారా అన్ని వివరాలు క్యూ ఆర్ కోడ్‌లో నిక్షిప్తమై ఉంటాయి. దీంతో భవిష్యత్తులో ఎవరూ సంబంధిత రైతుల అనుమతి లేకుండా పేర్లు గానీ, సరిహద్దులు గానీ మార్చలేరు. చివరికి రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు కూడా ఓటీపీ వస్తే గానీ ప్రక్రియ ముగియదు. అత్యంత కచ్చితత్వం, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ 20వేల సర్వే రాళ్లను రైతుల భూముల సరిహద్దుల్లో ఇప్పటికే పాతారు.

రైతులు చేయాల్సిన పనేమిటి...

సమగ్ర భూ సర్వే ప్రక్రియలో అధికారుల బాధ్యత ఎంత ఉందో.. రైతుల బాధ్యత కూడా అంతే ఉందని కె.ఆర్.ఆర్.సి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఆర్.వి. సూర్యనారాయణ పేర్కొన్నారు. తమ భూములను కాపాడేందుకు.. రక్షణ కల్పించేందుకు రెవెన్యూ, సర్వే విభాగం అధికారులు, సిబ్బంది రైతుల పొలాల వద్దకే వెళుతున్నారని గుర్తు చేశారు. రీ-సర్వే ప్రక్రియ నిర్ణీత కాలంలో సజావుగా సాగేందుకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాల్సి ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. సమగ్ర భూ సర్వే జరిగే గ్రామాల్లోని రైతులు వారి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నెంబరు, ఫొటో, ఇతర ప్రాథమిక వివరాలు అందించాల్సి ఉంటుందని వివరించారు. గ్రామంలో భూములు ఉండి అందుబాటులో లేని వ్యక్తులు వారి బంధువులను గానీ, స్నేహితులను గానీ పంపించి సర్వే చేయించుకోవాలని సూచించారు.

అనుమానమొస్తే మళ్లీ.. మళ్లీ చేస్తారు

రీ-సర్వే జరిగిన భూమిలో రైతులకు ఎలాంటి అనుమానాలున్నా అధికారులు తగిన చర్యలు తీసుకుంటారు. దగ్గరుండి సమస్యను పరిష్కరిస్తారు. నిబంధనల ప్రకారం రీ-సర్వే జరిగే గ్రామంలో ముందుగా ఫార్మ్ - 10ను అనుసరించి చాటింపు వేస్తారు. ఫార్మ్ - 19ను అనుసరించటం ద్వారా వ్యక్తిగత సమాచారం అందిస్తారు. 9(2) ద్వారా సర్వే ప్రక్రియ ముగిస్తారు. ఒకవేళ రైతుకు ఈ దశలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే 10(1) ద్వారా అప్పీల్‌కు వెళ్లొచ్చు. రైతుల ఫిర్యాదును పరిశీలించిన ఉన్నతాధికారులు మండల స్థాయి మొబైల్ మేజిస్ట్రేట్ అధికారులను పంపించి మళ్లీ సర్వే చేయిస్తారు. అప్పటికీ సంతృప్తి చెందకపోతే ఆర్.ఓ.ఆర్. నిబంధనల మేరకు ఆర్డీవో కోర్టులో సంప్రదించవచ్చు.

త్వరలోనే పత్రాల పంపిణీ... రెండో దశకు శ్రీకారం

సమగ్ర భూ సర్వే ప్రక్రియలో భాగంగా మొదటి దశ విజయవంతంగా ముగిసింది. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 24 మండలాల్లో రీ-సర్వే పూర్తయింది. 179 గ్రామాల్లోని 11వేల మంది రైతులకు త్వరలోనే సంబంధిత భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. మొదటి దశ పూర్తయిన నేపథ్యంలో మరో 150 గ్రామాల్లో రెండో విడత సర్వే చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. డిసెంబర్ ముగిసే నాటికి 75 గ్రామాల్లో, ఫిబ్రవరి ముగిసే నాటికి మరొక 75 గ్రామాల్లో రెండో దశ సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు కార్యాచరణ మొదలు పెట్టింది.

సువర్ణావకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎ. సూర్యకుమారి, కలెక్టర్, విజయనగరం జిల్లా.

వందేళ్ల తర్వాత వచ్చిన సువర్ణావకాశం ఇది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అధికారులు, సిబ్బంది రైతుల పొలాల వద్దకే వచ్చి సర్వే చేస్తున్నారు. ఒక్క రోజు సమయం వెచ్చిస్తే జీవితకాల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ అవకాశాన్ని వదులుకుంటే భవిష్యత్తులో మరలా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కావున రైతులందరూ అందుబాటులో ఉండి సమగ్ర భూ సర్వేను చేయించుకోవాలని, అధికారులకు, సిబ్బందికీ పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

రైతులకు మేలు చేసే బృహత్తర కార్యక్రమం-కోళ్ల కొండలరావు, కొర్లాం

రైతుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం ఇది. రైతులకు మేలు చేసే బృహత్తర కార్యక్రమం రీ-సర్వే పూర్వం ఎప్పుడో సర్వే జరిగిందని విన్నాం. మేం చూడలేదు. ప్రస్తుతం చేపట్టిన కార్యక్రమం వల్ల అధికారులే రైతుల వద్దకు వచ్చి సేవలు అందిస్తున్నారు. చిన్నచిన్న సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించి రీ-సర్వేను గనుక పూర్తి చేయగలిగితే అందరికీ మంచి జరుగుతుంది.

రికార్డుల్లోకి మా పేర్లు వచ్చాయని చెప్పారు - ఆర్. కృష్ణవేణి, కొర్లాం

మా తాతగారి నుంచి వారసత్వంగా వచ్చిన భూములు ఎవరెవరి పేర్లో ఉండేవి. ఇటీవల అధికారులు వచ్చి మా భూములను సర్వే చేశారు. ఈ కార్యక్రమం వల్ల మాకు ప్రయోజనం కలిగింది. తాతయ్య గారి నుంచి వచ్చిన భూములకు ఇప్పుడు మా పేర్లు వచ్చాయి. కొత్తగా అందజేసే రికార్డుల్లోకి మా పేర్లు వస్తాయని చెప్పారు. చాలా సంతోషకరమైన కార్యక్రమం ఇది